పోలింగ్ సమయం పెంపుపై అవగాహన

కామారెడ్డి, మే 3 : ఓటు ప్రాముఖ్యత, అదనంగా ఒక గంట పోలింగ్ సమయం పెంపుపై ప్రజల్లో అవగాహన నిమిత్తం గ్రామాల్లో ఆడియో ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నామని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్లు నిర్భయంగా, నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా ఓటు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 13న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే పోలింగ్‌లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, నిజాయితీగా వంద శాతం ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేసి ఓటు ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రతి ఒక్క ఓటరు ఓటు వేసేలా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఓటర్లు తమ పోలింగ్ కేంద్రం, బూత్ నంబర్ వివరాలు తెలుసుకోవడానికి హెల్ప్‌లైన్ 1950 నంబర్ ద్వారా లేదా www.voters.eci.gov.in, www.ceotelangana.nic.in వెబ్‌సైట్ల ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ చంద్రమోహన్
- రాబోయే మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం

కామారెడ్డి, మే 3 : ఈ నెల 5 నుంచి 7 వరకు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున ధాన్యం తడవకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మానిటరింగ్ అధికారులు, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు, లారీ ట్రాన్స్ పోర్టు కాంట్రాక్టర్లతో శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఇబ్బంది పడకుండా టార్పాలిన్లు, గోనె సంచులు కేంద్రాల్లో అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేందుకు లారీలను ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌పోర్టు అధికారులను ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ నిత్యానందం, డిప్యూటీ తహసీల్దార్లు, మానిటరింగ్ అధికారులు, లారీ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి

రామారెడ్డి, మే 3: కిందపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని రెడ్డిపేటలో చోటుచేసుకున్నది. ఎస్సై విజయ్‌కొండ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నామపురం శ్రీనివాస్(41) ఈ నెల ఒకటో తేదీన సాయంత్రం ఇంట్లో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. తల్లి నర్సవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

హోం ఓటింగ్ ప్రారంభం

బాన్సువాడ, మే 3 : లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఇంటి నుంచే ఓటు వేసే కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. బాన్సువాడ నియోజకవర్గంలో 85 ఏండ్లు పైబడిన వయోవృద్ధులు, దివ్యాంగులతో ఓట్ల వేయించేందుకు ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు బాన్సువాడలోని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రమేశ్ రాథోడ్ పోలింగ్ సామగ్రిని అందజేశారు. నియోజకవర్గంలో 203 మంది ఇంటి నుంచి ఓటు వేయనున్నట్లు ఆర్డీవో తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 5వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.

పోలింగ్ సామగ్రితో బయల్దేరుతున్న సిబ్బంది

కాంగ్రెస్‌కు ఎన్నికల్లో బుద్ధిచెప్పాలి

ఎల్లారెడ్డి మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అడ్లూర్ ఎల్లారెడ్డిలో ప్రచారం చేస్తున్న నాయకులు

జోరుగా కొనసాగుతున్న బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

ఎల్లారెడ్డి/ ఎల్లారెడ్డి రూరల్/ రామారెడ్డి/ డోంగ్లీ/కామారెడ్డి/బాన్సువాడ/మాచారెడ్డి, మే 3: మోసపూరిత హామీలను ఇచ్చిన కాంగ్రెస్‌కు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ ఎల్లారెడ్డి మండల, పట్టణ అధ్యక్షులు జలంధర్‌రెడ్డి, సతీశ్‌కుమార్ అన్నారు. మండలంలోని అన్నాసాగర్, ఆజామాబాద్, వెంకటాపూర్ గ్రామాల్లో శుక్రవారం ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో సొసైటీ అధ్యక్షుడు ఏగుల నర్సింహులు, లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ రవీందర్‌గౌడ్, నాయకులు వసంతం, విఠల్, రాము, సాయిబాబా, నును గొండ శ్రీనివాస్, శ్రవణ్‌కుమార్, దేవదాస్, నారాయణ, బబ్లూ తదితరులు పాల్గొన్నారు. సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో ఉపాధి హామీ కూలీల వద్ద బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జహీరాబాద్ ఎంపీగా గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మోసపూరిత వాగ్దానాలపై ప్రజలు ఆలోచించాలన్నారు. ప్రచారంలో బీఆర్ఎస్ సదాశివనగర్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్‌రావు, నాయకులు గడీల భాస్కర్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు. డోంగ్లీ మండలంలోని సిర్పూర్, టాక్లీ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటేసి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డోంగ్లీ సింగిల్ విండో వైస్‌చైర్మన్ విజయ్ పటేల్, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు మధుకర్ పటేల్, మండల ప్రధాన కార్యదర్శి మాన్కరే సంజయ్ తదితరులు పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం, వదల్‌పర్తి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రజలను మోసం చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ప్రచారంలో నాగిరెడ్డిపేట జడ్పీటీసీ మనోహర్ రెడ్డి, నాయకులు కృష్ణ, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డి లోని 46, 47వ వార్డుల్లో అనిల్‌కుమార్‌కు మద్దతుగా నాయకులు ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గెరిగంటి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గాలిఅనిల్ కుమార్‌ను గెలిపించాలని వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ వాల్ పోస్టర్లు అతికించి ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పుట్ట అశోక్, జంగిటి బాలరాజ్, విజయ్, కన్నయ్య, అమీర్‌ఖాన్ పాల్గొన్నారు. బాన్సువాడలోని అన్ని వార్డుల్లో బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి సూచనల మేరకు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి గాలి అనిల్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ గంగాధర్, వైస్ చైర్మన్ షేక్ జుబేర్, ఏజాస్, రాజు, కౌన్సిలర్ లింగమేశ్వర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు దాసరిశ్రీనివాస్, కారదర్శి ఉదయ్‌గుప్తా, రవీందర్‌గుప్తా, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షురాలు అనిత, గణేశ్, వెంకటేశ్, ఆమేర్ చావుస్, రఫీ, హకీం తదితరులు పాల్గొన్నారు. మాచారెడ్డి మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పగడాల బాల్‌చంద్రం, హంజీనాయక్, మద్దెల రాజు, అరవింద్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బాన్సువాడలో..

డోంగ్లీ మండలంలో..

నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం గ్రామంలో..

మాచారెడ్డి మండలంలోని పోతారంలో..

నేడు బీఆర్ఎస్

ఎన్నికల ప్రచారం, కార్నర్ మీటింగ్

బాన్సువాడలో కార్నర్ మీటింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బాన్సువాడ, మే 3 : బాన్సువాడ నియోజకవర్గంలోని బాన్సువాడ , బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లో శనివారం బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డితో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ ప్రచారంలో పాల్గొననున్నారని నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు(శనివారం) నస్రుల్లాబాద్ మండలంలో సాయంత్రం 6 గంటలకు, బీర్కూర్ మండలంలో సాయంత్రం 7 గంటలకు, బాన్సువాడలో రాత్రి 8 గంటలకు రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. బాన్సువాడలో నిర్వహించే కార్నర్ మీటింగ్ స్థలాన్ని రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీను, నాయకులు ఎజాజ్, గురువినయ్, దొడ్ల వెంకట్రామిరెడ్డి, అనిల్, హకీమ్ పాల్గొన్నారు.

నేడు బీర్కూర్, నస్రుల్లాబాద్‌లో రోడ్ షో

నస్రుల్లాబాద్, మే 3 : బీర్కూర్, నస్రుల్లాబాద్ మండల కేంద్రాల్లో జహీరాబాద్ పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా రోడ్ షో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ నస్రుల్లాబాద్ మండల అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్, బీర్కూర్ ఎంపీపీ రఘు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

డిగ్రీ వన్‌టైమ్ ఛాన్స్

ఫీజు గడువు పొడిగింపు

డిచ్‌పల్లి, మే 3 : టీయూ పరిధిలోని 2011 నుంచి 2016 వరకు డిగ్రీ (వైడబ్ల్యూఎస్) ఫెయిలైన సాధించిన విద్యార్థులకు వన్‌టైమ్ ఛాన్స్ కోసం ఫీజు చెల్లింపు గడువును పొడిగించినట్లు పరీక్షల నియంత్రణాధికారిణి అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఏ (ఎల్) కోర్సులకు 1, 2, 3వ సంవత్సరపు బ్యాక్‌లాగ్ పరీక్షలకు, 2016 నుంచి 2019 వరకు డిగ్రీ (సీబీసీఎస్) కోర్సులకు సంబంధించి 1, 2, 3, 4, 5, 6వ సెమిస్టర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు వన్‌టైమ్ ఛాన్స్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. జూన్, జూలైలో పరీక్షలు ఉంటాయని తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లింపు గడువు ఈనెల 2 వరకు ఉండగా.. ఈనెల 9వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. 100 రూపాయల అపరాధ రుసుముతో ఈనెల 10వ తేదీ వరకు చెల్లించవచ్చని వెల్లడించారు. మరిన్ని వివరాలకు టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఉపాధి పనుల్లో సిబ్బంది ఇష్టారాజ్యం

- జిల్లా అధికారులు హెచ్చరించినా మారని తీరు
- నష్టపోతున్న కూలీలు

చిన్న దేవీసింగ్‌తండాలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

పనిచేయని వారికి మూడు రోజులుగా గైర్హాజరు వేయకుండా వదిలేసిన సిబ్బంది

పెద్దకొడప్‌గల్, మే 3: ఈజీఎస్ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఉపాధి హామీ, గ్రామీణాభివృద్ధి అధికారి వామన్‌రావు, జిల్లా విజిలెన్స్ అధికారి దత్తాత్రి పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ అధికారులను హెచ్చరించారు. మండలంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఏప్రిల్ 24న పరిశీలించిన వారు సంబంధిత సిబ్బంది, అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. అయినా ఏపీవో, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పనులపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఉన్నతాధికారులు ఉపాధిలో కూలీల సంఖ్యను పెంచాలని ఆదేశించడంతో, పని చేయని వారికి హాజరు వేస్తున్నారని, దీంతో తాము నష్టపోతున్నామని పనులు చేసిన కూలీలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో కూలీలకు బదులు వారి పిల్లలు ఉపాధి పని చేసేందుకు వస్తున్నారని, అయినా సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

మండలంలోని చిన్న దేవీసింగ్ తండాలో బుధ, గురు, శుక్ర వారాల్లో చేపట్టిన ఉపాధి పనులకు గాను మస్టర్‌లో కొంత మంది కూలీలకు హాజరు వేశారు. మరికొందరికి గైర్హాజరు వేయకుండా అలాగే వదిలివేశారు. పనికి రాని వారికి కూడా శనివారం హాజరు వేస్తున్నారని పనిచేసిన కూలీలు ఆరోపిస్తున్నారు. జాబ్ కార్డు ఉన్న వారు కాకుండా పిల్లలు పనిచేసినా హాజరు వేస్తున్నారని తెలిపారు.

పొరపాటు జరుగకుండా చూసుకుంటాం..

ఈజీఎస్ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహిస్తాం. ఉపాధి హామీ పనులను పర్యవేక్షిస్తాం. ఇకపై ఎలాంటి పొరపాట్లూ జరుగకుండా చూసుకుంటాం.

- సుదర్శన్, ఏపీవో, పెద్దకొడప్‌గల్

'ఆకునూరి మురళిని అడ్డుకోవడం సరికాదు'

బిచ్కుంద, మే 3: రాజ్యాంగ రక్షణ కోసం బస్సు యాత్ర చేపట్టిన ఆకునూరి మురళిని అడ్డుకోవడం సరికాదని ఎమ్మార్పీఎస్(టీఎస్) జిల్లా అధ్యక్షుడు రుషెగామ భూమయ్య అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓబీసీలకు రాజ్యాంగంలో హక్కులు కల్పించిందని తెలిపారు. వాటిని ప్రమాదంలో పడేయాలని బీజేపీ చూస్తున్నదని ఆరోపించారు. దీనిపై ప్రజలను చైతన్యం చేసేందుకు మురళి పర్యటిస్తున్నారని, అతడిని బీజేపీ నాయకులు అడ్డుకోవడం సరికాదన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సింగం కాశీరాం, నాయకులు భీమయ్య, యాదవ్, రవీందర్, మహిపాల్, మారుతి, రవికుమార్, లాలు, సాయిరాం, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే కాంగ్రెస్ అసత్య ప్రచారం

మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

దోమకొండ, మే 3 : ప్రధాని మోదీ 10 సంవత్సరాలుగా చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని, బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో దోమకొండ సబ్ స్టేషన్ నుంచి మొదలు కొని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా బైక్ ర్యాలీని నిర్వహించారు. పెద్దమ్మ ఆలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో బీజేపీ జహీరాబాద్ అభ్యర్థి బీబీ పాటిల్‌తో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ అసత్య ప్రచారాలు చేస్తున్నదని, ప్రజలు వారి మాటలు నమ్మడం లేదన్నారు. అనంతరం బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ మాట్లాడుతూ.. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో కుంట లక్ష్మారెడ్డి, నరేందర్‌రెడ్డి, గంగారెడ్డి, మద్దురి భూపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, చింతల రాజేశ్, మనోజ్, జగదీశ్, గణేశ్, విఠల్‌రెడ్డి ఆయా గ్రామాల నాయకుల, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.300 చెల్లించేలా చూడాలి

మండలాధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ

కామారెడ్డి, మే 3 : మండలాల్లో ఉపాధి హామీ పథకం కింద అవసరమైన వివిధ పనులను గుర్తించి కూలీలకు ఉపాధి కల్పిస్తూ, కనీస వేతనం రూ.300 చెల్లించేలా చూడాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో డీఆర్డీవో చందర్ నాయక్‌తో కలిసి కూలీల హాజరు శాతం, కనీస వేతనం, పని ప్రాంతాల్లో సౌకర్యాలపై ఎంపీడీవోలు, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్స్, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల్లో కూలీల హాజరు, కనీస వేతనం చాలా తక్కువగా ఉందని రాబోయే రోజుల్లో సమీక్షించి హాజరు శాతం, కనీస వేతనం పెంచేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉపాధి కూలీలకు వడదెబ్బ తగలకుండా పని చేసే చోట టెంట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో కామారెడ్డి, మాచారెడ్డి, తాడ్వాయి, రాజంపేట, రామారెడ్డి మండలాల ఎంపీడీవోలు, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బుద్దె రాజేశ్వర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

బోధన్, మే 3: ఇటీవల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బుద్దె రాజేశ్వర్ మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను సాలూర మండల కేంద్రంలో శుక్రవారం కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పరామర్శించారు. బుద్దె రాజేశ్వర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఇల్తెపు శంకర్, బోధన్ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సాలూర షకీల్, స్థానిక నాయకులు ఇల్తెపు గంగారాం, రమేశ్ తదితరులు ఉన్నారు.

హోం, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను

సద్వినియోగం చేసుకోవాలి

మద్నూర్, మే 3: శని, ఆదివారాల్లో నిర్వహించనున్న హోం, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మద్నూర్‌లో ఆయన శుక్రవారం మాట్లాడారు. 80 ఏండ్లు పైబడిన, పూర్తిగా వైకల్యం ఉన్న వారికి హోం ఓటింగ్ అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందని పేర్కొన్నారు. ఇదివరకే ఫారం 12డీ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల విధులను నిర్వహించే వారు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో 8వ తేదీ వరకు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మాట్లాడుతున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి

కూలీలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీ
- బూర్గుల్‌లో ఈజీఎస్ పనుల పరిశీలన

కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్న అధికారి

గాంధారి, మే 3: పనిచేస్తున్న ప్రదేశంలో ఉపాధి హామీ కూలీలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీ అధికారులకు ఆదేశించారు. మండలంలోని బూర్గుల్ గ్రామంలో ఉపాధి కూలీలు చేపడుతున్న పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉదయం వేళలో మాత్రమే పనులు చేయించాలని, వారికి వడదెబ్బ తగలకుండా చూసుకోవాలన్నారు. ప్రతి రోజూ కనీసం 150 మందికి పని కల్పించాలని సూచించారు. చేసిన పనికి రూ.250వరకు గిట్టుబాటు అయ్యేలా చూడాలన్నారు. కూలీలకు ఆయన ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులను పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన నర్సరీని పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గాంధారి, లింగంపేట మండలాలకు చెందిన ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పనులు, నర్సరీల్లో మొక్కల పెంపకంపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఆర్డీవో చందర్‌నాయక్, ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డి పట్టణ అభివృద్ధికి రూ.25 కోట్ల నిధులు

ఎల్లారెడ్డి రూరల్, మే 3: ఎల్లారెడ్డి పట్టణ అభివృద్ధికి రూ.25 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు ప్రారంభం కాలేదని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంజూరైన నిధులతో డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్లు, రోడ్లు అభివృద్ధి చేస్తామన్నారు. ఆయనతోపాటు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..

ఎల్లారెడ్డి/ రామారెడ్డి, మే 3: ఎల్లారెడ్డికి చెందిన గౌడ సంఘం నాయకులు, సభ్యులు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రామారెడ్డి మండలంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గోజరి లచ్చిరెడ్డి శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

'ఆరె కటిక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

కామారెడ్డి, మే 3 : తెలంగాణ రాష్ట్ర వివిధ జిల్లాల ముఖ్యనాయకులు, రాష్ట్ర ఆరె కటిక నాయకులు ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ సమక్షంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరె కటిక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరడంతో షబ్బీర్ అలీ సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారని ఆరె కటిక సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో 46వ వార్డు కౌన్సిలర్ కన్నయ్య, ఆరెకటిక సభ్యులు పాల్గొన్నారు.

అటవీభూమి దున్నుతున్న రెండు ట్రాక్టర్ల పట్టివేత

రాజంపేట్, మే 3 : మండల పరిధిలోని హద్దుగుండు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో భూమిని దున్నుతున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు రేంజ్ అధికారి రమేశ్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లాకు చెందిన ముడావత్ లక్ష్మణ్, మహ్మద్ గౌసొద్దీన్ ట్రాక్టర్లని ఆయన తెలిపారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను కామారెడ్డి అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు చెప్పారు. ఎలాంటి అనుమతిపత్రం లేకుండా గురువారం సాయంత్రం అటవీభూమిని దున్నుతున్న దూప్‌సింగ్ తండాకు చెందిన మాలోవత్ బాల్య, ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. చెట్లను నరకడం, అటవీ భూమిని దున్నడం, ఆక్రమించడం నేరమని అన్నారు. సెక్షన్ ఆఫీసర్స్ సయ్యద్ బాబా, ఫారుక్, బీట్ ఆఫీసర్స్ మహేశ్, లచ్చయ్య, రాజమణి, దేవేందర్, భూపతి, పోలీసులు పాల్గొన్నారు.